బ్రహ్మాండమయిన ఆలయం. లోపల రాళ్ల పైన వేయి స్తంభాల మంటపం, గోపురం మీద అలంకరణల మీద మంటపం స్తంభాల మీద చెక్కబడ్డ అద్భుత శిల్పఖండికలు.

జనసమ్మర్దంలో విరజ తన్ను అంటిపెట్టుకుని నడిచింది. విరజ సాన్నిధ్యమూ, ఆలయ వాతావరణమూ, జనసమ్మర్దమూ కొత్తలోకంలో, పవిత్రమైన వాతావరణంలో విహరిస్తున్న భ్రమను కలుగచేసింది.

లోపల ప్రవేశించే ముందు కాళ్ళు ముఖం కడుక్కోటానికి మెట్లమీదుగా కిందికి దిగారు.

పాదాల మీద జరీ అంచు చీరను కొంచెం పైకెత్తి నీళ్ళలో మునిగిన మెట్టుమీద నుంచుని ముఖం కడుక్కుంటున్నది, విరజ. పైకి అరుణవర్ణంగా కనిపించే నీళ్ళలో తెల్లని తమ్మిపూలలాగ ఆమె పాదాలు మెరుస్తున్నాయి. ప్రసన్నంగా దర్శనమిస్తోంది.

రాజారావు తన పాదాల వేపు చూస్తుండటం గమనించిన విరజ చివ్వున పాదాలు పైకి తీసుకుంది నవ్వుతూ. రాజారావు పదకొండు గంటలయింది మీనాక్షీ దేవి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణాన్ని వదిలి వెళ్ళాలనిపించలేదు. కోనేటిగట్టున చల్లని నీడలో కూచున్నారు. ఎంత గొప్ప శిల్పకళా సౌభాగ్యము. ఇది తెలుగు నాయక రాజులు కట్టించిన ఆలయం. రాజారావులోని ఆంధ్రత్వం పులకరించింది. నాయక రాజుల కాలం నాటి సాహిత్యమూ, శిల్పకళా, అందుకున్న పున్నాగ ప్రసూనాలు, విజయ విలాసాది గ్రంథాలు, ముద్దుపళని, రంగాజమ్మలాంటి కవయిత్రులూ... రాజారావు హృదయాంబరంలో నక్షత్రాల్లా తళుకుమంటూ కాంతిపుంజాలు ఘనీభవించాయ్. సంభాషణకు దూరంగా విరజ వచ్చిపోయే సందర్శక యాత్రికుల్ని చూస్తూ కూచుంది.

రాజారావు ఆమె వేపు చూశాడు.

ఈ క్షణంలో తన దగ్గర కూచున్న విరజ తన నేత్రాల్ని మహా సౌందర్యం వేపు తిప్పించింది. తన హృదయభాండాన్ని మధురామృతంతో, అమృతభావనలతో నింపిన విరజ, కొన్నాళ్ళకు కేవలం జ్ఞాపకంగా స్మృతిపథంలో నిలిచిపోతుంది. ఇంతగొప్ప అవసరం విచ్చిపోయి కేవలం కలలు మిగిలిపోతాయి ఈ ఆలోచనతో రాజారావు కన్నులు బాష్పపూరితాలయ్యాయ్.

ఇది గమనించిన విరజ ఆ విషణ్ణత్వం కారణం ఊహించింది ఆప్యాయంగా రాజారావు చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంది.

ఇద్దరూ లేచారు. ఆ ద్వారం దాటి బయటికి వచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంట. ఎండ నిప్పులు చెరుగుతోంది, గాలి వేడిగా వీస్తోంది

"అబ్బ, ఎండలు ముదిరాయి" అంది విరజ.

"నాకోసం, ఎందుకు మీకు శ్రమ"

"ఛత్, యీ మాత్రానికే. ఎప్పుడూ ఎరగని ఉత్సాహం ఇవ్వాళ కలుగుతోంది నాకు."

కాలేజీ కాంటీన్ దగ్గరికి వచ్చారు, భోజనం ముగించి తిరుమల నాయక మహలు చూటానికి బస్సులో వెళ్ళారు. రెండు గంటలు కావస్తోంది. మహలు ముందు చెట్ల నీడలో కూచుంది విరజ. బాగా అలసిపోయింది. రాజారావు ఆమె పక్కన చతికిలపడ్డాడు.

అలా ఓ అరగంట కూచున్నారు. కాస్సేపటికి, రాజారావు లేచాడు. అతని చేతిని ఊతగా తీసుకొని లేచి నుంచుంది విరజ.

చుట్టుముటిన గైడ్లను తప్పించుకొని ముందుకు సాగిపోయ్యారు. లోపల జనసమ్మర్దం. చాలా చోట్ల విరజ రాజారావు చేయిపుచ్చుకునే నడిచింది. దర్బారు మహలూ, అంతఃపురమూ అన్నీ చూస్తూ మెట్లమీదుగా పైకివెళ్ళారు. పైనించి చూస్తే మిడిఎండలో మిలమిలా మెరుస్తోంది మధురా నగరము. వైగై నదీతీరమూ, ఉన్నత భవనాలు, పురవీధులూ, మీనాక్షీ దేవి ఆలయ గోపురం చూపిస్తూ విరజకు చెప్పాడు రాజారావు.

విశ్వనాథవారి ఏకవీర, గణపతిశాస్త్రి గారి మీనాంబిక నవలలు జ్ఞాపకానికి వచ్చాయి. ఆ కాలంలోని రాజకీయ, సాంఘిక వాతావరణమూ, రాజుల తీరూ అభివర్ణితాలయ్యాయి, ఆ నవలల్లో వాటిని గురించి చెప్పాడు విరజకు ఇంగ్లీషులో. రాజారావు వర్ణనా చాతుర్యమూ, ఆంగ్లభాషా మాధుర్యమూ విరజను ఆకట్టింది. మంత్రముగ్ధ భుజంగినిలా మళ్ళీ రాజారావు వెంట నడిచింది.

మహలు సమగ్రంగా చూసేసరికి సాయంత్రం ఆరుగంటలయింది. హోటల్లో కాఫీ టిఫిన్ ముగించి వైగై నదీతీరానికి నడిచారిద్దరూ.

నది తీరాన్ని సమీపిస్తున్న కొద్దీ నదీ తీరాల నుంచి వీస్తున్న గాలి హాయిగా స్పృశించింది

"చల్లగాలి ఆహ్వానిస్తున్నది మనల్ని" అన్నాడు రాజారావు

విరజ మాట్లాడలేదు. మౌనం వహించింది.

ఆమె వేపు చూశాడు. ముఖంలో యేదో గాంభీర్యమూ, కన్నుల్లో యేదో నిర్ణయమూ గోచరించింది. చకితుడైనాడు రాజారావు.

ఇంతసేపూ, చలాకీగా, సరదాగా, వున్న విరజ ముఖంలో గాంభీర్యమూ ఆమె నిశ్చల మౌనం రాజారావులో ఆతృతను ఆదుర్దాను కలిగించాయ్.

వాళ్ళకు దగ్గరగా మనుష్యులు తిరుగుతున్న అలికిడి లేదు. విరజ వీపు మీద చేయి వేశాడు రాజారావు. ఆమె అతనికి మరింత దగ్గరగా నడిచింది. ప్రవాహానికి కొంచెం దూరంలో మెత్తని తెల్లని ఇసుకమీద కూచున్నారిద్దరూ.

కొంచెం దూరంలో చాకలి వాళ్ళు బట్టలు ఉతుకుతున్న శబ్దం వినవస్తోంది.

నీటిమీద కొంగలు బారులు బారులుగా ఎగురుతున్నాయి. అనంతాకాశం నిర్మలంగా వుంది. వేడిచెందిన లోకం సాయంత్రం బాగా చల్లబడ్డది.

అస్తమిస్తున్న సూర్యుడి కాంతులు నీటిమీద వివిధ కాంతుల్ని సృష్టిస్తున్నాయ్. సంధ్యారాగంలో జగమంతా ఇంద్రజాలంలా వుంది.

రాజారావు కాళ్ళు బారచాచి యిసుకమీద వెల్లకిలా పడుకున్నాడు, ఆకాశంలోకి చూస్తూ.

దగ్గరగా కూచున్న విరజ చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు రాజారావు.

విరజ పాడింది. ఆమె గానంలోంచి బహిర్గతమైన అమృతప్రవంతి రాజారావును ముంచేసింది. ఆమె పాట వినడానికి వైగై నదీ, సంధ్యా ఆగాయి అనిపించింది. ఆమె పాటలోని ప్రతి పదమూ కార్తీకదీపాలా ఆ అద్భుతమైన సాయంత్రాన్ని వెలిగించింది.

రాజారావు లేచి నుంచున్నాడు. ఆవేశంతో పాడుతున్న విరజను లేవనెత్తాడు. దూరాన మనుష్యులు కనిపించడంలేదు. ఆమెను కౌగిలించుకున్నాడు రాజారావు. ఆమె శ్వాస వెచ్చగా తగులుతోంది.

దూరాన మీనాక్షీదేవి ఆలయంలో మోగుతున్న గంటల శబ్దం వినవస్తోంది.

విరజలో ఆనందమో, విషాదమో తెలీనిగాని ద్వంద్వభావం, మనసు కలచివేస్తోంది.

ఒకటి, రెండు కన్నీటిబిందువులు ఆమె చెంపమీద జాలువారాయి.

"విరజా భగవంతుడు ప్రసాదించిన వరానివి నువ్వు, నాకు. వచ్చే యేడాది యీ వాడ నాతో. తమిళదేశపు ఆలయ శిల్పసౌందర్యం, ప్రకృతి అందమూ, నీ కనుపాపల నీలినీడల్లో చూసుకుంటూ జీవితం గడపాలని వుంది." అన్నాడు రాజారావు డగ్గుత్తికతో.

"వస్తాను. ఎంతదూరమైనా, యెక్కడికైనా వస్తాను మీతో" ఆమె మాట్లాడలేకపోయింది. దుఃఖం ఆమె కంఠాన్ని రుద్ధం చేసింది.

"మీనాక్షీదేవి నాకు మిమ్మల్ని ప్రసాదించింది." అంటూ చీకట్లో రాజారావు పాదాలు పట్టుకుని కళ్ళకద్దుకుంది. వాళ్ళ సంభాషణ వినడానికి ఆగిన వైగై నదివిరి, తృప్తిగా సాగిపోయింది. సంధ్య కూడా ముందుకు సాగింది. చీకట్లో, విద్యుద్దీపాల వెలుగులో, వెలుగునీడల్లో విరజా, రాజారావు మధురాపురవీధులగుండా ఆలయాభిముఖులై వెళ్ళారు.

విరజ దాదాపు సగందూరం రాజారావు భుజాలమీద వాలి నడిచింది.

లోకంమీద వెన్నెల తెర మెల్లగా జారుతోంది. ★